సాక్షి విశాఖపట్నం

సోమవారం । 16 । అక్టోబర్ । 2023

ఐటీ డెస్టినీ విశాఖ

- బీచ్ ఐటీ డెస్టినేషన్ కాన్సెప్ట్‌తో సరికొత్తగా ముందుకు..
- బీజం వేసిన దిగ్గజ కంపెనీ ఇన్ఫోసిస్
- నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేతుల మీదుగా ప్రారంభం
- అదే బాటలో విప్రో 1000 మందితో విస్తరణకు ప్రణాళికలు
- భవిష్యత్తులో మరిన్ని కంపెనీలు విస్తరించేందుకు ఆసక్తి
- ఐటీ ఎమర్జింగ్ టెక్నాలజీ రీసెర్చ్ యూనివర్సిటీ ఏర్పాటుకు అడుగులు



ఇన్ఫోసిస్ డెవలప్‌మెంట్ సెంటర్

సాక్షి, విశాఖపట్నం : భారత్‌ను నడిపించే చోదక శక్తులుగా మారుతున్న టైర్–2 నగరాల్లో ఐటీ, ఐటీ ఆధారిత కంపెనీలు.. తమ శాఖల్ని విస్తరించుకుంటున్నాయి. మెట్రో నగరాలకు దీటుగా అభివృద్ధి చెందుతూ.. సకల సౌకర్యాలతో పరిఢవిల్లుతున్న టైర్–2 నగరాల్లో మిన్నగా ఉన్న విశాఖను మొదటి ఆప్షన్‌గా ఎంపిక చేసుకుంటూ తమ సంస్థ కార్యాలయాల్ని ఏర్పాటు చేసుకుంటున్నాయి. అద్భుతమైన ఐటీ పాలసీని ప్రవేశపెడుతూ.. మరోవైపు ఐటీ, ఐటీ ఆధారిత పరిశ్రమలకు హబ్‌గా త్వరలోనే అభివృద్ధి చెందేందుకు విశాఖపట్నంలో అపారమైన అవకాశాలున్నాయని ప్రపంచానికి చాటిచెప్పేందుకు ప్రభుత్వం బీచ్ ఐటీ కాన్సెప్ట్‌ని ప్రమోట్ చేసింది. అందుకే అంతర్జాతీయంగా పేరొందిన ఐటీ, ఐటీ అనుబంధ సంస్థలు విశాఖకు తరలివస్తున్నాయి. టెక్ మహీంద్ర, హెచ్‌సీఎల్, యాక్సెంచర్, రాండ్‌స్టాడ్, డబ్ల్యూఎన్ఎస్ మొదలైన ఐటీ, ఐటీ అనుబంధ దిగ్గజ సంస్థలు విశాఖ వైపు అడుగులు వేశాయి. తాజాగా ఇన్ఫోసిస్ సంస్థ తన డెవలప్‌మెంట్ సెంటర్ కార్యకలాపాలను మొదలుపెడుతోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం ఇన్ఫోసిస్‌ని ప్రారంభించనున్నారు. తొలి దశలో 1000 మందితో కార్యకలాపాలు ప్రారంభించి దశలవారీగా విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

అడుగులు వేస్తున్న మరిన్ని సంస్థలు

ఇన్ఫోసిస్ మాదిరిగా విశాఖలో తమ కార్యకలాపాలు విస్తరించేందుకు అనేక ఐటీ సంస్థలు ముందుకు వస్తున్నాయి. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ హయాంలో 2006లో విప్రో క్యాంపస్‌కు స్థలాన్ని కేటాయించారు. 750 మందితో ప్రారంభించాలని భావించినా.. చంద్రబాబు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం లేకపోవడంతో 300 మందితో ప్రస్థానం మొదలు పెట్టింది. ఇప్పుడు కార్యకలాపాల జోరు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం విప్రో ప్రతినిధులతో చర్చించింది. దశల వారీగా 1000 సీట్లకు విస్తరించేందుకు సిద్ధమని ప్రకటించింది. వర్చువల్ డెస్క్‌టాప్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్(వీడీఐ), క్లౌడ్ ప్రాజెక్టులకు కేంద్రంగా విశాఖ క్యాంపస్‌ని మార్చాలని నిర్ణయించింది. విశాఖలో స్టార్టప్‌ల ఏర్పాటుకు తాము సిద్ధంగా ఉన్నామంటూ నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీసెస్ కంపెనీస్(నాస్కామ్) సీఈవో సంజీవ్ మల్హోత్రా ప్రకటించారు. అదేవిధంగా ఐటీ రంగంలో తిరుగులేని నగరంగా విశాఖను అభివృద్ధి చేసేందుకు ఇక్కడే ఐటీ ఎమర్జింగ్ టెక్నాలజీ రీసెర్చ్ యూనివర్సిటీ ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతోంది. ఐటీ పరిశోధనలు, అభివృద్ధిలో భాగంగా.. ఎమర్జింగ్ టెక్నాలజీస్ ఎకోసిస్టమ్‌ని ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు కేంబ్రిడ్జిలోని మసాచుసెట్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంఐటీ) సహకారంతో పాటు సంయుక్త సర్టిఫికేషన్ కోర్సుల్ని ప్రవేశపెట్టాలని భావిస్తోంది. ఇందుకోసం ఐఏఎస్ అధికారులతో కూడిన ప్యానెల్‌ని కూడా ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

మహానేత వైఎస్ హయాంలోనే..

మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలోనే విశాఖలో ఐటీకి అడుగులు పడ్డాయి. మధురవాడలోని మూడు కొండల మధ్య 300 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన సెజ్‌లో తొలిదశలో ఇన్ఫోటెక్, సింబియాసిస్, మిరాకిల్, కెనెక్సా వంటి ప్రముఖ ఐటీ కంపెనీలు సహా మొత్తం 26 సంస్థలు తరలివచ్చాయి. క్రమంగా సంస్థలు పెరిగాయి. అయితే.. రూ.1800 కోట్లకు చేరుకున్న ఎగుమతులు ఆయన మరణానంతరం చంద్రబాబు ప్రభుత్వం వచ్చాక.. రూ.1400కి పడిపోయాయి. అనంతరం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక విశాఖలో ఐటీ అభివృద్ధిపై సీఎం వైఎస్ జగన్ దృష్టిసారించారు. గత ప్రభుత్వ హయాంలో బకాయి పడ్డ వందకోట్ల ప్రోత్సాహకాలను వెంటనే విడుదల చేశారు. అద్భుతమైన ఐటీ పాలసీని రూపొందించిన ప్రభుత్వం దిగ్గజ సంస్థల్ని ఆకర్షిస్తోంది.

అపారమైన అవకాశాలు



ఐటీ, ఐటీ ఆధారిత పరిశ్రమలకు హబ్‌గా త్వరలోనే అభివృద్ధి చెందేందుకు విశాఖలో అపారమైన అవకాశాలున్నాయి. ఐటీ పరిశ్రమలన్నీ తమ తదుపరి డెస్టినేషన్‌గా ద్వితీయ శ్రేణి నగరాల్ని ఎంపిక చేసుకుంటున్నాయి. ఐటీ సర్వీస్ సెక్టార్ పరిశ్రమల ఏర్పాటుకు వైజాగ్ వంటి నగరాలే మొదటి ప్రాధాన్యం. ఐటీ సంస్థలకు కావల్సిన మానవ వనరుల్ని అందించేందుకు సిద్ధంగా ఉన్నాం. ఎమర్జింగ్ టెక్నాలజీ, కోర్ ఐటీ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులపై సంస్థలు దృష్టిసారిస్తూ విశాఖలో కార్యకలాపాలు విస్తరిస్తున్నాయి.

– కిరణ్‌రెడ్డి, ఎపిటా గ్రూప్ సీఈవో

సీఎం పర్యటన ఇలా..



సాక్షి, విశాఖపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో పర్యటించనున్నారు. ఉదయం 10.20 గంటలకు సీఎం విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 10.40 గంటలకు మధురవాడ ఐటీ హిల్స్ నెం.3 వద్దకు వస్తారు. అక్కడ నుంచి రోడ్డు మార్గాన ఐటీ హిల్ నెం.2కు చేరుకొని ఇన్ఫోసిస్ కార్యకలాపాల్ని లాంఛనంగా ప్రారంభిస్తారు. అనంతరం ఇన్ఫోసిస్, వివిధ ఐటీ కంపెనీల ప్రతినిధులతో ముఖ్యమంత్రి కాసేపు సంభాషించనున్నారు. అనంతరం 11.55 గంటలకు బయలుదేరి హెలిప్యాడ్ వద్దకు చేరుకొని అక్కడ జీవీఎంసీ ఆధ్వర్యంలో బీచ్ క్లీనింగ్ మిషన్ ప్రారంభిస్తారు. అక్కడ నుంచి హెలికాప్టర్‌లో 12.15 గంటలకు పరవాడ చేరుకొని ఫార్మా సిటీలో గల యుజియా స్టెరైల్ ప్రైవేట్ లిమిటెడ్‌ను ప్రారంభిస్తారు. అనంతరం అచ్యుతాపురం సెజ్‌లో హెలిప్యాడ్ వద్దకు చేరుకొని.. అక్కడ మధ్యాహ్నం 1.30 నుంచి 1.45 వరకు ప్రజాప్రతినిధులతో సమావేశమవుతారు. అక్కడి నుంచి లారెస్ ల్యాబ్‌కు చేరుకొని యూనిట్–2ను ప్రారంభిస్తారు. పరిశ్రమను సందర్శించి, కంపెనీ సీఈఓ, డైరెక్టర్లు, ఉద్యోగులతో ఇంటరాక్ట్ అవుతారు. అక్కడ నుంచి హెలికాప్టర్‌లో 3.10 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు వస్తారు. అక్కడ నుంచి 3.20 గంటలకు తిరుగు పయనమవుతారు.

భవిష్యత్‌లో మరిన్ని ఐటీ సంస్థలు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి అమర్‌నాథ్

కొమ్మాది: భవిష్యత్‌లో విశాఖకు మరిన్ని ఐటీ సంస్థలు వచ్చే అవకాశం ఉందని మంత్రి అమర్‌నాథ్ అన్నారు. సోమవారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇన్ఫోసిస్ కార్యాలయాన్ని ప్రారంభించనున్న నేపథ్యంలో ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటీ ఉత్పత్తుల్లో విశాఖను సముచిత స్థానం నిలిపేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇన్ఫోసిస్ కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులకు ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించేందుకు యాజమాన్యం చర్యలు తీసుకుందన్నారు. మొదటి విడతలో వెయ్యి మంది ఉద్యోగులతో ఇన్ఫోసిస్ కార్యాలయం ప్రారంభం కానుందని తెలిపారు. ఆయన వెంట మేయర్ హరివెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు ఉన్నారు.

తూర్పులో వైఎస్సార్ సీపీ జెండా ఎగరాలి



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ సుబ్బారెడ్డి, చిత్రంలో ఎంపీ, తూర్పు సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ, మేయర్ హరివెంకటకుమారి, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, రవీంద్రబాబు, పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, పార్టీ తూర్పు పరిశీలకుడు బాబీరెడ్డి, కార్పొరేటర్లు, ముఖ్యనేతలు

- వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి
- ఎంపీ ఎంవీవీ ఆధ్వర్యంలో తూర్పు నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం



సమావేశానికి హాజరైన పార్టీ శ్రేణులు

ఎంవీపీకాలనీ : వచ్చే ఎన్నికల్లో విశాఖ తూర్పు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరాలని ఆ పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పార్టీ తూర్పు సమన్వయకర్త, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో బీచ్‌రోడ్డులోని గాదిరాజు ప్యాలెస్‌లో ఆదివారం పార్టీ తూర్పు నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సుబ్బారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. రాష్ట్ర సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలన్నారు. పార్టీలకతీతంగా అర్హతే ప్రామాణికంగా పథకాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ అన్నారు. ఇంత అభివృద్ధి, సంక్షేమం అందిస్తున్నా.. ప్రతిపక్షాలు పనికట్టుకుని విమర్శలు చేస్తున్నాయని వాటిని తిప్పికొట్టాలన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డి గెలుపు ఎందుకు అవసరమో తెలియజేయాలన్నారు. వచ్చే ఎన్నికల్లో తూర్పు నియోజకవర్గంలో గెలుపే పార్టీ శ్రేణుల లక్ష్యం కావాలన్నారు. ఈ విషయంలో గృహసారథులు, సచివాలయాల కన్వీనర్లు క్రియాశీలక పాత్ర పోషించాలని సూచించారు. వచ్చే జనవరి నుంచి పెన్షన్‌ను రూ.3000కు పెంచనున్నట్లు తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అవినీతి, కుంభకోణాల్లో కూరుకుపోయారన్నారు. ఆయనపై చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. పార్టీ తూర్పు సమన్వయకర్త, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో తూర్పులో గెలిచి సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా ఇచ్చేందుకు ప్రతి ఒక్కరూ ప్రత్యేక పాత్ర పోషించాలన్నారు. 40 రోజుల పాటు సచివాలయాల పరిధిలో రాష్ట్రానికి జగన్ ఎందుకు కావాలి అనే నినాదాన్ని స్పష్టంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. సంక్షేమాన్ని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన అంశాన్ని, రాష్ట్ర అభివృద్ధికి జరుగుతున్న కృషిని ప్రతి ఇంటికి చేర్చే బాధ్యత గృహసారథులు, సచివాలయాల కన్వీనర్లు తీసుకోవాలన్నారు. అనంతరం వైవీ సుబ్బారెడ్డి, ఎంపీ ఎంవీవీలను పార్టీ ముఖ్యనాయకులు గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు రవీంద్రబాబు, వరుదు కల్యాణి, మేయర్ గొలగాని హరివెంకటకుమారి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, పార్టీ తూర్పు నియోజకవర్గ పరిశీలకుడు బాబీరెడ్డి, పార్టీ ముఖ్యనాయకులు, కార్పొరేటర్లు, వార్డు ఇన్‌చార్జులు హాజరయ్యారు.

సర్వాంగసుందరంగా విశాఖ

- మున్సిపల్ శాఖ మంత్రి సురేష్
- సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన



బీచ్ క్లీనింగ్ యంత్రాల్ని పరిశీలిస్తున్న మంత్రులు సురేష్, అమర్‌నాథ్, మేయర్

పీఎం పాలెం : రాజధానిగా విశాఖను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నామని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ తెలిపారు. సీఎం పర్యటన ఏర్పాట్లను ఆదివారం ఐటీ మంత్రి అమర్‌నాథ్‌తో కలిసి ఆయన పరిశీలించారు. హెలిప్యాడ్ దగ్గర సీఎం ప్రారంభించనున్న బీచ్ క్లీనింగ్ యంత్రాలను ఆయన పరిశీలించి వివరాలను జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నగర పరిధిలోని సాగర తీరాల్ని మరింత పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. మొత్తం రూ.15 కోట్ల వ్యయంతో 6 బీచ్ క్లీనింగ్ యంత్రాల్ని అందుబాటులోకి తీసుకొచ్చామని, వీటిని సీఎం వైఎస్ జగన్ చేతుల మీదుగా ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఆర్కేబీచ్, రుషికొండ సహా ఆరు బీచ్‌లను ప్లాస్టిక్ రహిత ప్రాంతాలుగా శుభ్రంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో మేయర్ హరివెంకట కుమారి, జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

అధికారుల పరిశీలన : సీఎం జగన్ పర్యటన నేపథ్యంలో ఐటీ హిల్స్–2లోని ఇన్ఫోసిస్ వద్ద ఏర్పాట్లను కలెక్టర్ మల్లికార్జున, సీపీ రవిశంకర్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ పరిశీలించారు. అలాగే ఐటీ హిల్స్–3లో హెలిప్యాడ్ వద్ద బీచ్ క్లీనింగ్ వాహనాల ప్రారంభ ఏర్పాట్లను పరిశీలించారు.

క్లుప్తంగా

చిరుధాన్యాలతో దుర్గమ్మ



చిరుధాన్యాలతో తీర్చిదిద్దిన దుర్గామాత

ఏయూక్యాంపస్ : నగరానికి చెందిన చిత్రకారుడు విజయ్ కుమార్ శరన్నవరాత్రులను పురస్కరించుకుని చిరుధాన్యాలతో దుర్గామాత రూపానికి ప్రాణం పోశారు. ఈ చిత్రం ఎంతగానో ఆకట్టుకుంటోంది. రెండు రోజులుగా దాదాపు 20 గంటలకు పైగా శ్రమించి ఈ చిత్రాన్ని తీర్చిదిద్దారు.

ఆతిథ్య, పర్యాటకాభివృద్ధి అవశ్యం

సాక్షి, విశాఖపట్నం: అన్ని రంగాలు సమష్టి కృషితో ఆధునిక మార్కెటింగ్ పద్ధతులను అవలంబించడం ద్వారా పర్యాటక, ఆతిథ్య రంగాలను అభివృద్ధి చేయవచ్చని బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు అన్నారు. ఆదివారం నగరంలోని ఓ హోటల్‌లో ఆతిథ్య, పర్యాటక రంగాల అభివృద్ధిపై జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖ పర్యాటకాభివృద్ధికి బ్రాండ్ విశాఖ పేరుతో అడ్వర్టైజ్‌మెంట్ రంగ ప్రముఖులతో చర్చిస్తానన్నారు. ఆతిథ్య రంగంలో నైపుణ్యం కలిగిన ఉద్యోగుల కొరత ఉన్నందున స్థానిక యువతకు శిక్షణనిచ్చి ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ఇందుకవసరమైన శిక్షణ కేంద్రాలు, తరగతులను ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. దీనిపై తాను ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలతో మాట్లాడతానని చెప్పారు. ప్రస్తుతం హోటళ్లలో ఆక్యుపెన్సీ 50 శాతానికి మించడం లేదని, ఇది మరింత పెరగాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో ఏపీ ఛాంబరాఫ్ కామర్స్ చైర్మన్ శ్రీనాథ్, సీఐఐ వైస్ చైర్మన్ గ్రంధి రాజేష్, వివిధ రంగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

36 రోజులు.. 24 టేబుళ్లు

- నేటి నుంచి ఈవీఎంల ఫస్ట్ లెవెల్ చెకింగ్
- నవంబర్ 20 వరకూ నిర్వహణ
- విశాఖ చేరుకున్న 16 మంది బెల్ కంపెనీ ఇంజినీర్లు
- గుర్తింపు పొందిన పార్టీల ప్రతినిధుల సమక్షంలో 6 వేల ఈవీఎం యూనిట్ల తనిఖీలు
- ఈవీఎం గొడౌన్స్‌ను పరిశీలించిన కలెక్టర్, పోలీస్ కమిషనర్



ఈవీఎం గోదామును తనిఖీ చేస్తున్న కలెక్టర్ మల్లికార్జున, సీపీ రవిశంకర్, ఆర్డీవో భాస్కర్‌రెడ్డి

సాక్షి, విశాఖపట్నం : సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఏర్పాట్లు వడివడిగా నిర్వహించేందుకు జిల్లా ఎన్నికల యంత్రాంగం సిద్ధమవుతోంది. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సోమవారం నుంచి ఈవీఎంల ఫస్ట్ లెవల్ చెక్ (ఎఫ్ఎల్‌సీ) కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. 36 రోజుల పాటు జరిగే ఈవీఎంల పరిశీలన కార్యక్రమంలో 18 మంది బెల్ సంస్థ ఇంజినీర్లు ఆధ్వర్యంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ప్రతి ఈవీఎంనీ క్షుణ్ణంగా తనిఖీ చేస్తారు. 24 టేబుల్స్‌లో ఉదయం 9 నుంచి రాత్రి 7 గంటల వరకూ ప్రతిరోజు ఎఫ్ఎల్‌సీ జరగనుంది.

ఈవీఎం యూనిట్ల తనిఖీ చేసేందుకు ఫస్ట్ లెవెల్ చెక్ ప్రక్రియ సోమవారం నుంచి మొదలు కానుంది. ఎన్నికల కమిషన్ జాబితాలో ఉన్న ప్రతి రాజకీయ పార్టీకి చెందిన ప్రతినిధుల సమక్షంలోనే ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. నవంబర్ 20వ తేదీ వరకూ ఈవీఎంల పరిశీలన జరుగుతుంది. ఈవీఎంలు తయారు చేసిన బెల్ కంపెనీ ప్రతినిధులు ఆధ్వర్యంలో జరుగుతుంది. ఇప్పటికే బెల్‌కు చెందిన 16 మంది ఇంజినీర్లు నగరానికి చేరుకున్నారు. ఈవీఎంకు సంబంధించిన బీయూ, సీయూ, వీవీ ప్యాడ్ మూడు కలిపి ఒకేసారి తనిఖీ చేస్తారు. అన్నీ మెషీన్లు కరెక్ట్‌గా పనిచేస్తున్నాయని గుర్తించి యూనిట్ సంతృప్తి స్థాయిలో ఉందని ముద్రవేస్తారు. సమస్యలు గుర్తిస్తే వాటి స్థానంలో కొత్త యూనిట్స్‌ను జిల్లాకు కేటాయిస్తారు. ఇటీవలే జిల్లాకు 6 వేల వీవీప్యాడ్‌లు వచ్చాయి. ఈవీఎంలను తనిఖీ చేసే సమయంలో ఎన్నికల ప్రక్రియలో ఓటరు ఎలా వ్యవహరిస్తారో.. ఇక్కడ కూడా అదే మాదిరిగా చేపడతారు. మాక్‌పోలింగ్ మాదిరిగా నిర్వహించేందుకు మొత్తం 24 టేబుల్స్ ఏర్పాటు చేయనున్నారు. ఇంజినీర్ల సామర్థ్యం బట్టి అవసరమైతే మరికొన్ని టేబుల్స్ అదనంగా ఏర్పాటు చేయనున్నారు. ఆయా టేబుల్స్‌లో బెల్ ఇంజినీర్లతో పాటు డిప్యూటీ తహసీల్దార్, పంచాయతీ కార్యదర్శి, కంప్యూటర్ ఆపరేటర్ ఉంటారు. ముందుగా లోడ్ టెస్ట్ చేస్తారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఒక్కొక్కరూ ఈవీఎంలలో బటన్స్ టెస్ట్ చేసి.. ఫైనల్ రిజల్ట్ కరెక్ట్‌గా వస్తుందా లేదా అనేది స్వయంగా పరిశీలించిన తర్వాతే పనిచేస్తుందని ధ్రువీకరిస్తారు. జిల్లాలో ఇటీవల సవరించిన పోలింగ్ స్టేషన్ల నేపథ్యంలో మొత్తం 1,941 స్టేషన్లుండగా.. ఎన్నికల కోసం 6 వేల ఈవీఎం యూనిట్లు జిల్లాకు చేరుకున్నాయి. 2 వేల యూనిట్లు పార్లమెంట్ స్థానానికి, 2 వేల యూనిట్లు అసెంబ్లీ ఎన్నికలకు వినియోగిస్తాం. మరో 2 వేల యూనిట్లు ట్రైనింగ్, రిజర్వ్‌డ్ పార్ట్‌కు కేటాయించనున్నారు. ఈ ప్రక్రియ నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను ఇప్పటికే చేశారు. స్థానిక చినగదిలిలోని ఈవీఎం గోదాములను కలెక్టర్ డా ఎ.మల్లికార్జున, నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్, భీమిలి ఆర్డీవో భాస్కర్‌రెడ్డితో కలిసి ఆదివారం సాయంత్రం తనిఖీ నిర్వహించారు. భద్రతాపరమైన ఇబ్బందులు లేకుండా జాగ్రత్త వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు. సీసీ కెమెరా నిర్వహణ గదిని, వీవీ ప్యాట్ల గదిని పరిశీలించిన ఆయన అక్కడ అధికారులకు పలు సూచనలు చేశారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల జిల్లా అధ్యక్షులు నుంచి ఫొటోలతో ఆథరైజేషన్ లెటర్ తీసుకురావాలని, వారికి మాత్రమే ఫస్ట్ లెవెల్ చెకింగ్‌కు ప్రవేశం ఉంటుందని కలెక్టర్ మల్లికార్జున తెలిపారు.

పలు రైళ్ల గమ్యం కుదింపు

తాటిచెట్లపాలెం : ఇటీవల వాల్తేర్ డివిజన్, కొత్తవలస – కిరండూల్ (కేకే) లైన్, మనబార్ – జరాటి స్టేషన్ పరిధిలో రైల్వేట్రాక్‌పై కొండ చరియలు విరిగిపడిన ప్రాంతంలో పునరుద్ధరణ పనులు ముగిసినప్పటికీ ప్రయాణికుల భద్రత దృష్ట్యా ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లకు ఇంకా అనుమతులు ఇవ్వలేదు. ఈ కారణంగా పలు రైళ్లు ఆయా తేదీల్లో గమ్యం కుదిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ లైన్‌లో ప్రస్తుతం గూడ్స్ రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి.

- భువనేశ్వర్‌లో ఈ నెల 15, 16న బయల్దేరే భువనేశ్వర్ – జగదల్‌పూర్ (18447) హిరాఖండ్ ఎక్స్‌ప్రెస్ కోరాపుట్ వరకే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో జగదల్‌పూర్‌లో బయల్దేరాల్సిన జగదల్‌పూర్ – భువనేశ్వర్ (18448) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 16, 17న కోరాపుట్ నుంచి బయల్దేరి భువనేశ్వర్ చేరుకుంటుంది.
- విశాఖపట్నంలో ఈ నెల 15, 16న బయల్దేరే విశాఖపట్నం – కిరండూల్ (18514) నైట్ ఎక్స్‌ప్రెస్ కోరాపుట్ వరకే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో కిరండూల్‌లో బయల్దేరాల్సిన కిరండూల్ – విశాఖపట్నం (18513) ఎక్స్‌ప్రెస్‌గా ఈ నెల 16, 17న కోరాపుట్ నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది.
- విశాఖపట్నంలో ఈ నెల 16, 17న బయల్దేరే విశాఖపట్నం – కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్ అరకు వరకే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో కిరండూల్‌లో బయల్దేరాల్సిన కిరండూల్ – విశాఖపట్నం (08552) పాసింజర్ స్పెషల్ ఈ నెల 16, 17న అరకు నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది.
- హౌరాలో ఈ నెల 15, 16న బయల్దేరే హౌరా – జగదల్‌పూర్ (18005) సమలేశ్వరి ఎక్స్‌ప్రెస్ టిట్లాఘడ్ వరకే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో జగదల్‌పూర్‌లో బయల్దేరాల్సిన జగదల్‌పూర్ – హౌరా (18006) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 16, 17న టిట్లాఘడ్ నుంచి బయల్దేరి హౌరా చేరుకుంటుంది.
- రూర్కెలాలో ఈ నెల 16న బయల్దేరే రూర్కెలా – జగదల్‌పూర్ (18107) ఎక్స్‌ప్రెస్ కోరాపుట్ వరకు నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో జగదల్‌పూర్‌లో బయల్దేరాల్సిన జగదల్‌పూర్ – రూర్కెల (18108) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 17న కోరాపుట్ నుంచి బయల్దేరి రూర్కెలా చేరుకుంటుంది.

సీఎం పర్యటనకు పటిష్ట బందోబస్తు

అల్లిపురం: సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం విశాఖ పర్యటన నేపథ్యంలో సుమారు 1200 మందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ తెలిపారు. పోలీస్ కమిషనరేట్‌లో నగర శాంతిభద్రతల డీసీపీలు, క్రైం డీసీపీలకు ఆయన సూచనలు చేశారు. బందోబస్తు పలు కేటగిరీలుగా విభజించి ఒక్కో విభాగానికి ఒక్కొక్క ఉన్నతాధికారిని పర్యవేక్షణాధికారిగా నియమించారు. ముఖ్యమంత్రి పర్యటనలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. నగరంలో వాహనాల రాకపోకలకు విఘాతం కలుగకకుండా ట్రాఫిక్ రెగ్యులేషన్ చేపట్టేందుకు ప్రత్యేక పోలీస్ సిబ్బందిని నియమించారు. వీఐపీలు పాల్గొనే ప్రాంతాల్లో స్నిఫర్ డాగ్ స్క్వాడ్, బాంబు స్క్వాడ్లతో పరిశీలించడంతోపాటు సీఎం పర్యటించే ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టినట్లు వివరించారు.

డప్పు కళాకారుడు రమణ మృతి తీరని లోటు




అల్లిపురం: నగరానికి చెందిన డప్పు కళాకారుడు, నటుడు, గాయకుడు రమణ మృతి కళారంగానికి తీరనిలోటని పలువురు పేర్కొన్నారు. అల్లిపురానికి చెందిన రమణ డప్పు కళాకారుడిగా, నటుడిగా, గాయకుడిగా ప్రత్యేకతను ఏర్పరుచుకున్నాడని పలువురు తెలిపారు. శుక్రవారం ఆయన విశాఖలో గుండెపోటుతో మృతి చెందగా..శనివారం అంత్యక్రియలు నిర్వహించారు. రమణ పూర్తి పేరు బుడబండ్ల రమణమూర్తి. డప్పు వాయిద్యంలో పేరు ప్రఖ్యాతలు రావడంతో అందరూ డప్పు రమణ అని పిలిచేవారు. రమణకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వీధి నాటకాలు, జానపద గీతాలు, గజల్స్ వృత్తిగా కళామతల్లి సేవలో తరించారు. వేల సంఖ్యలో వీధి నాటకాలను ప్రదర్శించాడు. ప్రస్తుతం రమణ శ్రీకాంత కృష్ణమాచార్య అనే పద్య నాటకంలో ఒక పాత్ర పోషిస్తున్నారు. ఈ నాటకం త్వరలోనే తెనాలిలో జరగనున్న వీణ అవార్డ్స్ నాటకోత్సవంలోనూ, నంది నాటకోత్సవానికి ప్రదర్శనకు ఎంపికైంది.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు

మహారాణిపేట : జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు సోమవారం 22 ప్రాంతాల్లో నిర్వహించనున్నారు. అర్బన్ పరిధిలో 19 ప్రాంతాల్లో, రూరల్‌లో మూడు ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహించనున్నారు. ఆరిలోవ–తోటగరువు (3వ సచివాలయం), బక్కన్నపాలెం సాయిరామ్‌కాలనీ, బాలాజీనగర్ పార్వతీనగర్, లాసన్స్‌బే కాలనీ గొల్లవీధి (1), విద్యానగర్ కాలనీలో ఎల్‌బీ కాలనీ, పాత రేసవానిపాలెం, టీపీటీ కాలనీ, రంగిరీజు వీధిలో బురుజుపేట, చెంగల్రావుపేట పరిధిలో చందక వీధి, కొబ్బరితోట పరిధిలో కుమ్మరివీధి, రైల్వే న్యూకాలనీ పరిధిలో సుబ్బలక్ష్మీనగర్, అంబేద్కర్ కాలనీ పరిధిలో మాధవధార, భవాని గార్డెన్స్ పరిధిలో తుమ్మడిపాలెం,ఏఎస్ఆర్ నగర్ పరిధిలో మురళీనగర్, నక్కవానిపాలెం పరిధిలో హిమాచల్‌నగర్, శ్రామికనగర్–2 పరిధిలో వేదుళ్లనరవ, కణితి పరిధిలో కళింగ నగర్, బుచ్చిరాజుపాలెం పరిధిలో బుచ్చిరాజుపాలెం(1), పెందుర్తి పరిధిలో మర్రి చెట్లకాలనీ, నరసింహా నగర్–5లో గోపాలపట్నంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. రూరల్‌లో ఆనందపురం పరిధిలో గండిగుండం, భీమిలి పరిధిలో దాకమర్రి, పద్మనాభం పరిధిలో అనంతవరంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు.

వైఎస్సార్ సీపీ నేత కనకరాజు హఠాన్మరణం



సింహాచలం: వైఎస్సార్ సీపీ పెందుర్తి రూరల్ మండల అధ్యక్షుడు నక్క కనకరాజు (52) ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. పెందుర్తి మండలం అక్కిరెడ్డిపాలెంలో నివాసం ఉంటున్న కనకరాజుకు ఉదయం 11 గంటల సమయంలో గుండె నొప్పిరావడంతో వెంటనే కుటుంబ సభ్యులు పెందుర్తిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు చికిత్స అందించినా ఫలితం లేకుండా పోయింది. దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అంటే కనకరాజుకు ఎంతో అభిమానం.

కారు ఢీకొని ఐటీ ఉద్యోగి దుర్మరణం

మృతుని భార్య నిండు గర్భిణి



ఉదయ్ కుమార్ (ఫైల్)

పీఎం పాలెం: కారు ఢీకొని ఓ ఐటీ ఉద్యోగి దుర్మరణం చెందాడు. రెండు మూడు రోజుల్లో మృతుని భార్య ప్రసవించనుండగా ఈ దుర్ఘటన జరగడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. రక్తం పంచుకుని పుట్టబోయే బిడ్డను చూడకుండానే ఈ లోకాన్ని వీడిపోయాడని గుండెలవిసేలా రోదిస్తున్నారు. పీఎం పాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకున్న ప్రమాదానికి సంబంధించి స్థానిక సీఐ వై.రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అడవివరం వెంకటాద్రినగర్‌కు చెందిన బోడ సూరిబాబు, భార్య నిర్మలకు వివాహితులైన ఇద్దరు కుమారులు సందీప్, ఉదయ్ కుమార్ సంతానం. ప్రస్తుతం వీరంతా కలిసి నివసిస్తున్నారు. సింహాద్రి అప్పన్న కొండపై ప్లాస్టిక్ బొమ్మలు దుకాణం నడుపుతూ కుమారులు ఇద్దరినీ చదివించడంతో వారు ప్రయోజకులై ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. చిన్న కుమారుడు ఉదయ్ కుమార్ (32) బెంగళూరులో ఐటీ ఉద్యోగం చేస్తున్నాడు. కొన్నాళ్లుగా వర్క్ ఫ్రం హోమ్ నేపథ్యంలో ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఏడాది కిందటే అతనికి సరిహ అనే యువతితో వివాహం జరిగింది. ప్రస్తుతం ఆమె నిండు గర్భిణి. రెండుమూడు రోజుల్లో ప్రసవిస్తుందని వైద్యులు నిర్ధారించారు. ఈ క్రమంలో మధురవాడలోని మిత్రుడిని కలిసేందుకు మరో స్నేహితుడు జగన్‌ను తీసుకుని ద్విచక్ర వాహనంపై ఆదివారం మధ్యాహ్నం ఇంటి నుంచి ఉదయ్‌కుమార్ బయలుదేరాడు. క్రికెట్ స్టేడియం ఎదురుగా ఉన్న జాతీయ రహదారిపై వెళ్తూ ఎంవీవీ సిటీ ముందు గల రోడ్డు మలుపు తిరుగుతుండగా వెనుక నుంచి వస్తున్న కారు బలంగా ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో ఉదయ్ కుమార్ అక్కడికక్కడే మరణించగా అతని స్నేహితుడు జగన్‌కు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. క్షతగాత్రుని ఆస్పత్రికి తరలించారు. మృతుని సోదరుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ప్రమాదానికి కారకుడైన కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నామని సీఐ తెలిపారు.

ముగిసిన ఎస్ఐ మెయిన్స్ పరీక్షలు



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న అడ్మిన్ ఏడీసీపీ రాజు

అల్లిపురం: ఏపీ పోలీస్ స్టేట్ లెవెల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో నగరంలో పలు పరీక్ష కేంద్రాల్లో సబ్ ఇన్‌స్పెక్టర్ (సివిల్), రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్(ఏపీఎస్‌పీ) అభ్యర్థుల మెయిన్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ రవిశంకర్ పర్యవేక్షణలో, విశాఖ రేంజ్ డీఐజీ ఎస్.హరికృష్ణ ఆధ్వర్యంలో నగరంలో 19 పరీక్షా కేంద్రాలలో పరీక్షలు నిర్వహించారు. ఉదయం జరిగిన పరీక్షలో 11,069 మంది పరీక్షలకు హాజరవ్వగా, మధ్యాహ్నం 11,064 మంది హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను నగర శాంతిభద్రతల డీసీపీలు, క్రైం డీసీపీలు పర్యవేక్షించగా, అడ్మిన్ ఏడీసీపీ ఎం.ఆర్.కె.రాజు నోడల్ ఆఫీసర్‌గా తనిఖీలు నిర్వహించారు.

సంకెళ్లతో టీడీపీ నిరసన

మహారాణిపేట: చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో ఆదివారం టీడీపీ కార్యాలయం వద్ద చేతులకు సంకెళ్లు వేసుకొని ఆ పార్టీ నేతలు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం ప్రజల్లో సమక్షంలో ఉండే చంద్రబాబును అరెస్టు చేసి 37 రోజులైనా స్కిల్ కేసులో ఒక రూపాయి అవినీతి జరిగిందని గాని, ఒక్క ఆధారం కూడా చూపలేకపోయారన్నారు. చంద్రబాబు నాయుడు అరెస్టు ప్రభావం తెలంగాణ ఎన్నికలపై ఉంటుందని తెలుగు మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత అన్నారు. ఆదివారం టీడీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. జగన్, కేసీఆర్‌లది అన్నదమ్ముల అనుబంధం అని ఎద్దేవా చేశారు.

వైభవంగా శరన్నవరాత్రి మహోత్సవాలు



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, ఈవో శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ సింహాచలం



ఆదిలక్ష్మి అలంకరణలో కనకమహాలక్ష్మి

- ఆదిలక్ష్మిగా దర్శనమిచ్చిన సిరులతల్లి
- తొలి రోజు లక్ష కుంకుమార్చన

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో శరన్నవరాత్రి మహోత్సవాలు ఆదివారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. స్థానిక ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి, అమ్మవారికి ప్రత్యేక పూజ నిర్వహించి ఉత్సవాలు ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె.శిరీష, సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు, ఉప కార్యనిర్వాహక ఇంజినీర్ సీహెచ్‌వీ రమణ, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ సింహాచలం, పలువురు ధర్మకర్తలు పాల్గొన్నారు.

ఆదిలక్ష్మి అలంకరణలో..

శరన్నవరాత్రి మహోత్సవాల్లో తొలి రోజు ఆదివారం మూలవిరాట్ వద్ద అమ్మవారు ఆదిలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి లక్ష కుంకుమార్చన పూజ నిర్వహించారు. ఆటోనగర్‌కు చెందిన బండి నరేష్‌కుమార్, ఎంవీపీ కాలనీకి చెందిన సిరిపరపు గణేశ్వరరావు లక్ష కుంకుమార్చనకు సహకరించారు. శరన్నవరాత్రుల తొమ్మిది రోజులు అమ్మవారిని అలంకరించేందుకు పట్టు చీరలను లక్కీ షాపింగ్‌మాల్, సౌత్ ఇండియా షాపింగ్‌మాల్ వాళ్లు సమర్పించారు. సోమవారం అమ్మవారు ధనలక్ష్మి అలంకరణలో దర్శనమివ్వనున్నారు. అమ్మవారికి లక్ష చామంతులతో పూజ నిర్వహించనున్నారు.

గర్భాలయ ప్రవేశం లేదు

శ్రీదేవి శరన్నవరాత్రుల సందర్భంగా ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రోజుకో అలంకరణలో అమ్మవారు దర్శనమివ్వనున్న నేపథ్యంలో ఆ సమయంలో భక్తులకు గర్భాలయ ప్రవేశం లేదని ఈవో కె.శిరీష పేర్కొన్నారు. యథావిధిగా ఉదయం 5 గంటలకు పంచామృతాభిషేకం నిర్వహించనున్నారు. ఈ నెల 18న అష్టదళ పద్మారాధన, 19న లక్ష తులసిపూజ, 20న క్షీరాభిషేకం సేవలు శరన్నవరాత్రుల సందర్భంగా రద్దు చేసినట్టు పేర్కొన్నారు.

మానసిక ఉల్లాసానికి పార్కులు అవసరం



స్నిపర్ పార్కును ప్రారంభించిన వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి. చిత్రంలో మేయర్ హరి వెంకటకుమారి, కేకే రాజు, పార్టీ ముఖ్య నేతలు, కార్పొరేటర్లు

స్నిపర్ పార్క్ ప్రారంభించిన వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి

సీతమ్మధార : మానసిక ఉల్లాసానికి పార్కులు అవసరమని వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. ఆదివారం జోన్–3,14 వార్డు, నార్త్‌ఎక్స్‌టెన్షన్‌లో రూ.2.5 కోట్లతో నిర్మించిన స్నిపర్ పార్కును వైవీ సుబ్బారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వార్డులో పార్కులు ఏర్పాటు చేయనున్నామన్నారు. రూ2.5 కోట్లతో అన్ని సదుపాయాలతో పార్కు నిర్మించడం సంతోషంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నగరాభివృద్ధికి ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. మేయర్ గొలగాని హరి వెంకటకుమారి మాట్లాడుతూ ఆహ్లాదకర వాతవరణంలో స్నిపర్ పార్కు తీర్చిదిద్దడం అభినందనీయమన్నారు. నెడ్‌క్యాప్ చైర్మన్ కేకే రాజు మాట్లాడుతూ పార్కులో నాలుగు వాకింగ్ ట్రాక్‌లు, సీతాకోకచిలుకల ఉత్పత్తి కేంద్రం, పిల్లలకు ఆటపరికరాలు వంటి ఏర్పాటు చేశామన్నారు. యాంఫీ థియేటర్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందన్నారు. 14 వార్డు కార్పొరేటర్ అనిల్‌కుమార్‌రాజు, ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాద్‌రాజు, రాష్ట్ర కార్యదర్శి చొక్కాకుల వెంకటరావు, టిడ్కో హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ ప్రసన్నకుమార్, డిప్యూటీ మేయర్, పార్టీ మండల అధ్యక్షుడు కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, అల్లు శంకరావు, యాత కార్పొరేషన్ చైర్మన్ పిల్లి సుజాత, జోన్–3 కమిషనర్ విజయలక్ష్మి, డీడీ హెచ్.దామోదర్, కార్యనిర్వాహక ఇంజినీర్ శ్రీనివాసరావు, కార్పొరేటర్లు సాడిపద్మారెడ్డి, పి.ఉషశ్రీ, కో–ఆప్షన్ సభ్యులు సేనాపతి అప్పారావు, మండల పార్టీ అధ్యక్షురాలు జి.వి.రమణి, మహిళా విభాగం జోనల్ ఇన్‌చార్జు పీలా వెంకటలక్ష్మి, స్నిపర్ పార్క్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బాలాజీ, సెక్రటరీ విశ్వనాథ్ వర్మ, కోశాధికారి కృష్ణంరాజు, హరి వర్మ, జానకి రామరాజు, కాశీవిశ్వనాథ్, జేసీ ఎస్ మండల కన్వీనర్లు, డైరెక్టర్లు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, సచివాలయం కన్వీనర్లు పాల్గొన్నారు.

కలాం జీవితం స్ఫూర్తిదాయకం




అబ్దుల్ కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు

సాక్షి, విశాఖపట్నం: మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జీవితం యువతరానికి ఆదర్శం కావాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు అన్నారు. విద్యార్థి దశ నుంచి రాష్ట్రపతి వరకూ అబ్దుల్ కలాం ఎదిగిన తీరు స్ఫూర్తిదాయకమన్నారు. మధ్యతరగతి కుటుంబంలో జన్మించి శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా దేశానికి ఆయన అందించిన సేవలు మరువలేనివని కొనియాడారు. ఆదివారం ఎండాడ లా కాలేజీ సమీపంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా మైనార్టీ విభాగం అధ్యక్షులు కేవీ బాబా ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం జయంతిని నిర్వహించారు. మైనారిటీ నేత, నియోజకవర్గ పరిశీలకుడు ఐహెచ్ ఫరూఖీతో కలిసి కోలా గురువులు అబ్దుల్‌కలాం చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్ పిల్లా సుజాత, విశాఖ జోన్ ఇన్‌చార్జిలు భర్కత్ అలీ, మారుతి ప్రసాద్, తుళ్లి చంద్ర శేఖర్, జిల్లా అనుబంధ విభాగ అధ్యక్షులు అడ్డాల కృపా జ్యోతి, బోని శివ రామకృష్ణ, పెంగ్ర అప్పన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి రోజా రాణి తదితరులు పాల్గొన్నారు.

త్వరలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు

మంత్రి అమర్‌నాథ్ హామీ



మంత్రి అమర్‌నాథ్‌తో మాట్లాడుతున్న విశాఖ వీఏడబ్ల్యూజేహెచ్ సొసైటీ ప్రతినిధులు

సీతమ్మధార : జర్నలిస్టులకు త్వరలోనే ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. విశాఖ అక్రిడిటేటెడ్ వర్కింగ్ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ (వీఏడబ్ల్యూజేహెచ్ఎస్) గౌరవాధ్యక్షులు కేజీ రాఘవేంద్రారెడ్డి, జి.జనార్దన్‌రావు, అధ్యక్షుడు బి.రవికాంత్ ఆదివారం మంత్రి అమర్‌నాథ్‌ను ఆయన నివాసంలో కలిసి జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. తమ సొసైటీ ద్వారా రిజిస్టర్ అయిన అక్రిడిటేటెడ్ జర్నలిస్టుల వివరాలను ఆయనకు అందజేశారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారు. అతిత్వరలోనే జర్నలిస్టులు కచ్చితంగా శుభవార్త వింటారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చే విషయంలో సానుకూలంగా ఉన్నారని, విశాఖలోని అక్రిడిటేటెడ్ జర్నలిస్టులకు న్యాయం చేసేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళతానని హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో ఉపాధ్యక్షుడు కె.పరశురాం, సహాయ కార్యదర్శి ఎం.చిట్టిబాబు, ఆర్గనైజింగ్ కార్యదర్శి బి.రమేష్, సభ్యులు బి.శ్రీనివాసరావు ఉన్నారు.

సిటీలో హార్లే డేవిడ్‌సన్ బైక్‌లు



హార్లే డేవిడ్ సన్ బైక్‌ను ఆవిష్కరించిన అతిథులు

తాటిచెట్లపాలెం : బైక్ సెగ్మెంట్‌లో యువతను ఉర్రూతలూగించే ప్రముఖ అమెరికన్ ద్విచక్ర వాహన తయారీ సంస్థ హార్లే డేవిడ్‌సన్ బైక్‌లు తొలిసారిగా నగర రోడ్లపై దూసుకురానున్నాయి. టీఎస్ఎన్ కాలనీలోని శివశంకర్ హీరో షోరూంలో ఆదివారం సాయంత్రం హార్లే డేవిడ్ సన్ ఎక్స్–440 బైక్‌ను అతిథులు సమక్షంలో ఆవిష్కరించారు. వైజాగ్‌లో మొదటి హార్లే బైక్‌రైడర్ దీపక్, ప్రఖ్యాత ఆర్కిటెక్ట్, హార్లే రైడర్ నవీన్, వుమెన్ బైక్ రైడర్, బైక్ రైడింగ్‌లో అనేక అవార్డులు గెలుచుకున్న వైశాలి మూరె, శివశంకర్ హీరో మేనేజింగ్ డైరెక్టర్ ప్రసాద్‌ల చేతులమీదుగా ఈ నూతన బైక్ ఆవిష్కరణ జరిగింది. ఇప్పటికే ఈ బైక్‌లను బుక్ చేసుకున్న వారికి అతిథులు చేతులమీదుగా తాళాలను అందజేశారు. ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధులు మాట్లాడుతూ మొట్టమొదటి సారిగా హార్లే డేవిడ్‌సన్ బైక్‌ను విశాఖలో విడుదల చేస్తున్నట్లు, బుకింగ్‌లు ప్రారంభమైన దగ్గరనుంచి అనూహ్య స్పందన వచ్చిందన్నారు.